పింఛన్‌దారులకు తప్పని అగచాట్లు



సింగరాయకొండలో సోమరాజుపల్లి పంచాయతీ టీపీనగర్‌లో ఒకే ప్రాంతంలో కూర్చొని పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

సింగరాయకొండ: పింఛన్‌దారులు పింఛన్ కోసం అగచాట్లు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల వ్యవస్థ గురించి పట్టించుకోకుండా సోమవారం సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. అయితే సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లకుండా ఒకే చోట కూర్చొని పింఛన్‌దారులను అక్కడకు రప్పించారు. గ్రామాల్లో ఎక్కువ భాగం సచివాలయ సిబ్బంది ఏదో ఒక సెంటర్లో కూర్చొని ఫించన్ పంపిణీ చేసేందుకు ప్రాధాన్యం ఇచ్చారని పింఛన్‌దారులు వాపోయారు. పింఛన్ల పంపిణీపై నియోజకవర్గ ప్రత్యేకాధికారిగా నియమించిన ఎ కుమార్ గ్రామాల్లో పింఛన్ల పంపిణీని పరిశీలించగా ఎక్కువ శాతం సచివాలయ సిబ్బంది ఏదో ఒక సెంటర్లో ఉండి పంపిణీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ సచివాలయ సిబ్బంది మాత్రం మాకు లబ్ధిదారుల ఇళ్లు తెలియకపోవడంతో ఒకే ప్రాంతంలో కూర్చొని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సర్వర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదని, గ్రామంలోని సెంటర్‌లో అయితే పనిచేస్తుందని చెప్పారు. గత నెలలో కొంత మంది పింఛన్‌దారులకు ఊరికి వెళ్లారని, వారు నెలలో ఇస్తారో లేదోనని సచివాలయాల వద్దకు వెళితే అక్కడ సమాధానం చెప్పే వారే కరువయ్యారు. మొత్తం మీద పింఛన్ల పంపిణీ సచివాలయ సిబ్బందికి కత్తి మీద సాములా మారిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. పింఛన్ల పంపిణీపై సర్పంచులు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీలకు ఎటువంటి సమాచారం లేదు.

మర్రిపూడి: ఇంటింటికీ పింఛన్ల పంపిణీ కార్యక్రమం తొలిరోజే అభాసుపాలైంది. సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లకుండా గ్రామాల్లోనే దేవాలయాలు, పాఠశాలలు, ప్రైవేట్ స్థలాల వద్ద కూర్చొని పింఛన్‌దారులను అక్కడికే పిలిపించారు. దీంతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఇబ్బంది పడ్డారు. సర్వర్ పనిచేయకపోవడంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని పింఛన్‌దారులు వాపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికే వచ్చి పింఛన్లు ఇచ్చారని, కానీ ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు.

పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు



పామూరులో పింఛన్ల పంపిణీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పామూరు: పేదలకు ఇచ్చే పెన్షన్ పంపిణీ నగదులో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పామూరు, మండలంలోని వగ్గంపల్లె గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీని ఆర్డీఓ జాన్ ఇర్విన్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, ఇర్రి కోటిరెడ్డి, ఉప్పలపాటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ప్రభుత్వ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో, గ్రామాల్లో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పెంచిన నగదును లబ్ధిదారులకు అందచేశారు. ఆర్డీఓ పి. జాన్ ఇర్విన్, కమిషనర్ టీవీ రంగరావు, మేనేజర్ ప్రసాద్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొండపి(సింగరాయకొండ): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన మీకోసంలో రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. కొలుతలు వేయాలని, పాస్‌బుక్ మంజూరు చేయాలని అర్జీలు వచ్చాయన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి రెండు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ కేవీఎస్ చక్రవర్తి తెలిపారు. ఇంటి స్థలం ఆక్రమణకు గురైందని, సతుకుపాడులో పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని అర్జీలు ఇచ్చారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు నగదు బహుమతులు ప్రధానం చేస్తున్న దాతలు

టంగుటూరు: క్రమశిక్షణతో కూడిన చదువు మాత్రమే విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపగలదని ఎన్ఆర్ఐ నార్నె శ్రీనివాసులు అన్నారు. మండలం లోని ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దివంగత నార్నె మల్లయ్య మెమోరియల్ ట్రస్టు ద్వారా నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ ఏడాది 584 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచిన ఉప్పుతెర్ల నాగ వెంకటసాయికి రూ. 50 వేలు, ద్వితీయస్థానం సాధించిన చిడిపోతు అమృతకు రూ.30 వేలు, తృతీయస్థానం సాధించిన ఎహోషాకు రూ.20 వేలు అందజేశారు. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న సుదర్శి పూజిత, వాకా హేమవతికి ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున అందజేశారు. చిడిపోతు ట్రస్టు ద్వారా చిడిపోతు అమృతకు రూ. 10 వేలను చిడిపోతు వెంకటేశ్వర్లు అందించారు. గ్రామస్తులు నార్నె వెంకట్రావు నాగ వెంకటసాయికి రూ. 5 వేలు, పమిడి వెంకటేశ్వర్లుకు రూ. 10 వేలు కలిగిన సైన్సు ల్యాబ్ పరికరాలు ప్రధానోపాధ్యాయుడు వాకా వెంకటేశ్వరరెడ్డికి చేతుల మీదగా అందించారు. సర్పంచ్ బిళ్లా రూసీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

సీఎస్‌పురం(పామూరు): అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు వస్తుందని ఎంఈఓ జె.ప్రసాదరావు అన్నారు. ఎంపీడీఓ ఉద్యోగ విరమణచేసి జి.కృష్ణయ్యను సోమవారం రాత్రి స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సీనియర్ అసిస్టెంట్ రమేష్, రాజా, పంచాయతీ కార్యదర్శులు రాంప్రసాద్, రవికుమార్, ఏపీఓ శ్రీనివాసనాయక్, మన్నేపల్లి పెద్దన్న, ఉపాధ్యాయులు, సీసీలు పాల్గొన్నారు.

మీకోసంకు స్పందన కరువు

సింగరాయకొండ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి స్పందన కరువైంది. మండలస్థాయి అధికారులంతా హాజరైనా ఒక్క అర్జీ కూడా రాలేదు.

వైద్యులకు సన్మానం



డాక్టర్ తన్నీరు మల్లికార్జునను సన్మానిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

కందుకూరు: అంతర్జాతీయ డాక్టర్స్‌డేను పురస్కరించుకుని వాసవీ క్లబ్ లెజెండ్స్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు. కోవూరు రోడ్డులోని హరిణి ప్రజా వైద్యశాల డాక్టర్ తన్నీరు మల్లికార్జున, పార్కు రోడ్డులోని న్యూలైఫ్ హాస్పిటల్ డాక్టర్ కోటపాటి అనిల్‌కుమార్‌లను సన్మానించి మొక్కలు అందజేశారు. డాక్టర్‌లు ఆధునిక సమాజంలో దైవంతో సమానమని, రోగులకు వైద్యసేవలు అందించి పునర్జన్మను ప్రసాదిస్తున్నారని వివరించారు. ఇటువంటి డాక్టర్‌లను సన్మానించుకోవడం, వారిని గౌరవించడం గొప్ప విషయమని వాసవీక్లబ్ లెజెండ్స్ ప్రెసిడెంట్ రవ్వా శ్రీనివాసులు అన్నారు.

సమాజానికి ఉపయోగపడేలా వైద్యవృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సెక్రటరీ ఇన్నమూరి శ్రీనివాసులు, ట్రెజరర్ చీదెళ్ల క్రిష్ణ, వాసవీ వనితా క్లబ్ ప్రెసిడెంట్ కొత్తూరి నటరాజకుమారి, సెక్రటరీ నారాయణ సుకన్య, ట్రెజరర్ పెరూరి లలిత, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ గుర్రం మంజులకుమారి, జెడ్‌సి కోట వెంకటేశ్వర్లు, గుర్రం అల్లూరయ్య, కోట నరశింహం, నూకల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూమి సారవంతం



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: పొగాకు రైతులు పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలు నాటి కలియదున్నితే భూమి సారవంతమై నాణ్యమైన దిగుబడులు వస్తాయని, అలాగే పంట మార్పిడి చేయాలని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ఠ ధర రూ. 360 పలికింది. చిరుకూరపాడు, పంగులూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1241 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1168 కొనుగోలు చేసి 73 బేళ్లు తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.360, కనిష్ఠ ధర రూ.205, సరాసరి రూ.309.80 పలికింది. వేలంలో 42 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వర్

సీఎస్‌పురం(పామూరు): పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ద్వారా భర్తీచేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని డిప్యూటీ డీఈఓ ఎ.చంద్రమౌళీశ్వర్ అన్నారు. మండలంలోని శీలంవారిపల్లిలోని దిరి వెంకటనరసయ్య, లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత ప్లస్2 పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు లేరని విద్యార్థులు ఆయన దృష్టికితేగా వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌ద్వారా ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. హైస్కూల్ స్థాయిలో 2 ఇంగ్లీష్‌పోస్టులు, పీఎస్, గణితం ఖాళీగా ఉన్నాయని తెలపగా భర్తీకి చర్యలు చేపడతామన్నారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 456 మార్కులు, బైపీసీలో 419 మార్కులు సాధించిన గోగు మహాలక్ష్మి, కానగారి రేవతిలను అభినందించారు. ఈఓ రాజాల కొండారెడ్డి, హెచ్‌యం నాగినేని తిరుపతయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కందుకూరు: పట్టణంలోని స్కంధపురి సోమేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం శివ, పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే ఆలయంలో పలు ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక అలంకరణలు, వేద మంత్రోచ్చరణల మధ్య సాగిన శివ, పార్వతుల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

కనులపండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో తాళిచూపుతున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

పామూరు: మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాలెంలో కోదండరామస్వామి తిరునాళ్ల సందర్భంగా సోమవారం సీతా సమేత కోదండరామస్వామి శాంతి కల్యాణోత్సవం రుత్వికుల వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు అర్చకులు కె.రవికిరణ్‌శర్మ అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం సీతా, రాముల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, కుంకుమపూజ నిర్వహించి స్వామివార్లకు వేడుకగా ఎదురుకోల నిర్వహించారు. కల్యాణ మండపంపై వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా భజంత్రీల మేళతాళాల నడుమ శాంతి కల్యాణం జరిపించారు. సాయంత్రం స్వామివార్లకు వసంతోత్సవం, గ్రామోత్సవం వైభవంగా సాగింది. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



బ్యాటరీషాపు ప్రారంభోత్సవంలో తాటిపర్తి

సింగరాయకొండ: యువత వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెంది అందరికీ ఆదర్శంగా నిలవాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వైఎస్సార్ సీపీ నాయకుడు షాన్‌బాషా బ్యాటరీ షాపు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. షేక్ లియాఖత్, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, షేక్ అల్లాభక్షు, షేక్ మస్తాన్, సవళం కోటేశ్వరరావు, జాన్ కిషోర్, అల్లాఉద్దీన్, కరీం, జావేద్, ముజీబ్, ఫయాజ్, ఆర్ఎంపీ సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండండి



పీసీపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది



సింగరాయకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సింగరాయకొండ: చిన్నారులు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఉజ్వల అన్నారు. మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ బాలిరెడ్డినగర్ లో సోమవారం డయేరియాపై ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఉజ్వల మాట్లాడుతూ 0–5 సంవత్సరాల లోపు పిల్లలకు నీళ్లవిరోచనాలు అయితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాపించాలని, రెండు వారాల పాటు జింక్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. డయేరియా వ్యాధి ప్రాణాంతకమని అప్రమత్తంగా ఉండాలని వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రం ఉచితంగా అందజేస్తామని వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

పీసీపల్లి: ప్రజలు అతిసారపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు యషిత, మంజుల అన్నారు. స్థానిక గుదేవారిపాలెం పీహెచ్‌సీ క్యాంప్‌లో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో అతిసారపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 0–5 ఏళ్ల లోపు పిల్లలకు ఒకటి లేదా మూడు రోజుల పాటు పలుచగా విసర్జన వస్తే దాన్ని అతిసారగా పరిగణించాలన్నారు. అనంతరం అతిసార కరపత్రాలు ఆవిష్కరించారు. సర్పంచ్ మరియమ్మ, వి.పెద్దన్న, ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్ఎం డి.ఆంజనేయులు, కె.లక్ష్మీ సుజాత, రేణుక, జక్రయ్య ఉన్నారు.

ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

కందుకూరు: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి ఒక అర్జీ మాత్రమే వచ్చిందని, సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అన్ని విభాగాల అధికారులు సోమవారం అందుబాటులో ఉంటారని వివరించారు. అలాగే పట్టణంలో పారిశుధ్యం, తదితర సమస్యలు తెలియజేసేందుకు 9177700267 నంబర్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు.

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాపరిష్కార వేదికకు మూడు అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. మండల స్థాయికి సంబంధించి 16 శాఖలకు చెందిన అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. మూడు అర్జీలు రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. త్వరితగతిన వీటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ. 359

కొండపి(సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ఠ ధర రూ.359 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వేలానికి 1059 బేళ్లు రాగా 1002 బేళ్లు కొనుగోలు చేసి 57 బేళ్లను తిరస్కరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రత్నాకరం రామరాజు



నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రమానాయక్



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రంగనాథ్

కనిగిరి రూరల్: ప్రతి ఒక్కరు నూతన చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని కనిగిరి డీఎస్పీ రత్నాకరం రామరాజు అన్నారు. స్థానిక పామూరు బస్టాండ్ సెంటర్‌లో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ దాసరి వెంకటేశ్వరరావు, ఎస్సై త్యాగరాజు పాల్గొన్నారు.

పామూరు: విద్యార్థులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ ఎం రామానాయక్ అన్నారు. పామూరులోని అక్షర జూనియర్ కళాశాలలో సోమవారం కళాశాల సీపీ కదిరి బాబూరంగారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ రామానాయక్ నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ఎస్సై బి.ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు జాజం శ్రీనివాసులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: నూతన చట్టాలతో ప్రజలకు చట్టపరంగా భద్రత పెరుగుతుందని సీఐ దాచేపల్లి రంగనాథ్ అన్నారు. స్థానిక కందుకూరు రోడ్డు సెంటర్‌లో నూతన చట్టాలపై ప్రజలకు కల్పించారు. సీఐ మాట్లాడుతూ గతంలో ఉన్న చట్టాల కంటే జూలై ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన చట్టాలతో ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎస్సై టి.శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

టంగుటూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని సూరారెడ్డిపాలెం ఫ్లై ఓవర్ వద్ద సోమవారం రాత్రి జరిగింది. స్థానిక జాతీయ రహదారి పోలీస్ సిబ్బంది తెలిపిన ప్రకారం..టంగుటూరు వైపు నుంచి ఒంగోలు వెళుతుండగా సూరారెడ్డిపాలెం ఫ్లైఓవర్‌పై గుర్తుతెలియని వాహనం అధిక వేగంతో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఇనమనమెల్లూరు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన ద్విచక్రవాహనదారుడు

క్లుప్తంగా

నేడు కార్యకర్తలకు అందుబాటులో బుర్రా

కందుకూరు: వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండనున్నారు. ఇటీవలే కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత కార్యక్రమాలు ముగించుకున్న ఆయన మంగళవారం కందుకూరు రానున్నారు.

సహస్రలింగేశ్వరుడికి కలశాభిషేకం



అభిషేకానికి కలశాలతో వస్తున్న భక్తులు

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడులో మహారుద్రపీఠం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని సహస్రలింగేశ్వరుడికి, 1116 శివలింగాలకు 108కలశాలతో అభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలి



కొట్టాలపల్లిలో ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

వెలిగండ్ల: బడిబయట ఉన్న పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఎంఈఓలు దాసుప్రసాద్, దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. మండలంలోని కొట్టాలపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ బడిఈడు పిల్లలందరినీ గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. టీడీపీ నాయకుడు కొండు భాస్కర్‌రెడ్డి రూ.20 వేల విలువైన విద్యా సామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం పి.మాధవరావు, ఉపాధ్యాయులు ఎస్ మాధవి, పీవీఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

టంగుటూరు: ప్రజలు అంటువ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రసాద్‌బాబు అన్నారు. టంగుటూరు పోతుల చెంచయ్య కాలనీలో డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యాధికారి బాలాజీ అశోక్, సీహెచ్‌ఓ మాతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



కట్టా శ్రీనివాసులు

లింగసముద్రం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కట్టా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న య శేషుబాబు వలేటివారిపాలెం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓమాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వేలం ద్వారా రూ.3.31 లక్షల ఆదాయం

సీఎస్‌పురం(పామూరు): భైరవకోనలో దేవాదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం 3 రకాల దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో ఆలయానికి రూ.3.31 లక్షల ఆదాయం వచ్చిందని, త్వరలో మరో 3 రకాల దుకాణాల నిర్వహణకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. సిబ్బంది రమణయ్య, అనిల్, పలువురు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ

కందుకూరు: సక్షమ్ కందుకూరు శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఆర్‌సీ, అలెన్కో సహకారంతో దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ ట్రై సైకిల్స్, వీల్‌చైర్స్, ట్రై సైకిల్, వినికిడి యంత్రాలను సోమవారం పంపిణీ చేశారు. చన్నా వెంకట రామాంజనేయులు, ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పిడికిటి వెంకటేశ్వర్లు, డాక్టర్ తన్నీరు మల్లిఖార్జున, సురేష్‌రెడ్డి, చక్కా కేశవరావు, అల్లూరయ్య పాల్గొన్నారు.

ధూపదీప నైవేద్య పథకాన్ని పునరుద్ధరించాలి

గుడ్లూరు(కందుకూరు): దేవదాయశాఖ ద్వారా దేవాలయాలకు ధూపదీప నైవేద్య కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని గుడ్లూరుకు చెందిన సనాతన ఫౌండేషన్ తరుపున కలెక్టర్ హరి నారాయణన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో దీపానికి నోచుకోని ఎన్నో దేవాలయాలకు తమ సనాతన ఫౌండేషన్ ద్వారా నైవేద్యం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.